క్లుప్తంగా

డిక్షనరీపై పిల్లలకు అవగాహన



డిక్షనరీపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్న రాజేంద్రవర్మ

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం పిల్లలకు పెద్దబాల శిక్ష, డిక్షనరీలపై లైబ్రేరియన్ ఎల్. రాజేంద్రవర్మ అవగాహన కల్పించారు. కంప్యూటర్ ఆపరేటర్ కె. అరుణకుమారి పిల్లలకు కంప్యూటర్ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు చెత్త బుట్టల విధానం అవలంబిద్దాం



తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న రంథి గోపికృష్ణ తదితరులు

అల్లిపురం: మూడు చెత్త బుట్టల విధానం అవలంబిద్దాం అంటూ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంథి గోపికృష్ణ శుక్రవారం వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లోను మూడు చెత్తబుట్టలు తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పాడవేయరాదని సూచించారు. తడి- పొడి, ప్రమాదకరమైన చెత్తను విడగొట్టి మూడు చెత్తబుట్టల్లో నిలువ చేసి ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతతో మనం ఆరోగ్యంగా ఉంటామని, తద్వారా మన వాడ, మన వార్డు, మన నగరం ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, సచివాలయ కార్యదర్శులు, వార్డు వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

రామాలయంలో వైదిక సదస్సు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం జరిపారు. సాయంత్రం వైదిక సదస్సు నిర్వహించారు. అనంతరం ఆలయం బేడా మండపంనందు స్వామి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, రుత్వికులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో సత్తాచాటిన బాలబాలికలను జిల్లా జట్లుగా ఎంపిక చేసి ఈనెల 29 నుంచి నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు పంపనున్నారు. ఈ సందర్భంగా పోటీలను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ ప్రారంభించి జట్లను పరిచయం చేసుకున్నారు. అతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరు కాగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సమస్యల పరిష్కారం

జగదాంబ: వైఎస్సార్‌సీపీతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. శుక్రవారం వార్డులో దుర్గమాంబ సమాజంలో సమస్యలను వార్డు మహిళలతో కలసి పరిశీలించారు. కాలువలు పూడిక తీత, యూజీడీ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారం అవుతున్నాయంటే కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వల్లే అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా చేస్తే.. కోరుకున్న కొలువు

- విద్యార్థినులను నిపుణులుగా తీర్చిదిద్దుతున్న జవహర్ నాలెడ్జి కేంద్రం
- డిగ్రీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో తర్ఫీదు

అందుబాటులోకి వచ్చిన శాస్త్ర, సాంకేతిక రంగాలను చక్కటి భవిష్యత్ కోసం వినియోగించుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కోరుకున్న ఉద్యోగం పొందాలంటే యువత సాంకేతికంగా ఉన్నత స్థాయిలో నైపుణ్యం కలిగి ఉండాలి. చదువు, కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ వంటి వాటిలో మంచి ప్రవేశం కలిగి ఉంటే అవకాశాలకు కొదవే ఉండదు. పాతజైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జి కేంద్రం ఈ దిశగా అడుగులు వేస్తూ విద్యార్థినులను తీర్చిదిద్దుతూ వారి భవితకు బాటలు వేస్తోంది.



జేకేసీ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: ప్రస్తుతం నడుస్తున్నది నవీన శకం. ఇప్పుడు కేవలం చదువుతోనే భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటామంటే కుదిరే పని కాదు. కళాశాల చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లోనూ నైపుణ్యం సంపాదించుకుంటేనే భవితకు భరోసా దొరుకుతుంది. అలాగే లాంగ్వేజెస్ పట్ల కూడా నేటి విద్యార్థులు దృష్టి సారించాలి. అప్పుడే ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో కోరిన కొలువు సులువుగా దొరుకుతుంది. జవహర్ నాలెడ్జి సెంటర్ ఇప్పుడు ఆ దిశగానే విద్యార్థులను తీర్చిదిద్దుతోంది.

ఈ విద్యార్థినులు డిఫరెంట్..

పాత జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జి కేంద్రం ద్వారా ఉన్నత విద్యా విభాగంలో విద్య–ఉద్యోగితలను అనుసంధానిస్తూ, విద్యార్థులను ఉద్యోగితకు అనుగుణంగా తీర్చిదిద్దే పనిలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత, అభివృద్ధే లక్ష్యంగా జేకేసీ దిక్సూచిగా నిలుస్తోంది. కళాశాలల్లో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వారిని ఉద్యోగులుగా మారుస్తూ విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది జవహర్ నాలెడ్జి సెంటర్.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందా..

విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశాను. కళాశాలలో ఉన్న జేకేసీ ద్వారా శిక్షణ పొందాను. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో అవగాహన కల్పించడమే కాక మాట్లాడే విధానం, మెలకువలను కళాశాల ఇంగ్లీషు అధ్యాపకులు బోధించారు. ఫలితంగా జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇండియన్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికయ్యా.

– సీహెచ్ రాజ్యలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

భాషలపై అవగాహన..



కళాశాల జేకేసీ ల్యాబ్‌లో కొత్తకొత్త అవకాశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులకు భాషలపై అవగాహన ఇస్తున్నారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఇంటర్వ్యూల్లో అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేటట్టుగా విద్యార్థులను తయారు చేస్తున్నారు. జేకేసీ మెంటర్ రాజు అన్ని విషయాలు అర్థమయ్యేలా వివరిస్తుంటారు.

– జీఎన్ ప్రత్యూష, పూర్వ విద్యార్థిని

ఉద్యోగావకాశాలపై శిక్షణ ఇస్తున్నారు..



ఉద్యోగావకాశాలపై మంచి శిక్షణ ఇస్తున్నారు. భాషపై ప్రేమ, ఆప్యాయత పెరిగేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఉద్యోగం ఎలా పొందాలి అనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. జేకేసీ కో–ఆర్డినేటర్ పద్మప్రియ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

– బ్రి.సాయి ప్రత్యూష, బీఎస్సీ ఎంబీసీ, కళాశాల పూర్వ విద్యార్థిని

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు..



కమ్యూనికేషన్ స్కిల్స్ మంచి శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు జేకేసీ ద్వారా తెలుసుకుంటున్నాం. ఇంగ్లీషు మేడం పద్మప్రియ అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారు.

– డి.రుచిత, కళాశాల పూర్వ విద్యార్థిని

ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం..



జవహర్ నాలెడ్జి కేంద్రం విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుతూ, వారిని ఉన్నత విద్యావంతులుగా మార్చడంతో పాటు, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తోంది. కళాశాలల్లో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వారిని ఉద్యోగులుగా తయారు చేస్తున్నాం. తద్వారా విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది జవహర్ నాలెడ్జి సెంటర్.

– డాక్టర్ ఎస్.శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

రాష్ట్ర శ్రేయస్సుకు ఉద్యమం

సీతమ్మధార : విభజన హామీలు నెరవేర్చని ప్రభుత్వాల మొండి వైఖరి వల్ల రాష్ట్రానికి నష్టం కలుగుతుందని చెబుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ అవగాహన, నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ద్వారా పరిశ్రమలకు కేంద్ర రాయితీలు, విద్యుత్ రాయితీలు వస్తాయన్నారు. తద్వారా యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవడానికి ప్రతి ఆంధ్రుడు వారంలో ఒక రోజు ఈ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షీతల్ మదన్, శీర రమేష్‌కుమార్, చంద్రశేఖర్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రెండు జాతాలు గత నెల 31న ప్రారంభమయ్యాయని తెలిపారు. నగరాలు శుభ్రపరచడం, మంచినీళ్లు, విద్యుత్ తదితర ప్రజలకు అందించే సేవల్లో మున్సిపల్ కార్మికులు అగ్రభాగాన నిలుస్తున్నారని చెప్పారు. అటువంటి వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 తర్వాత రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో సిటు నాయకులు పి. వెంకట్‌రెడ్డి, నూకరాజు, రాజు, రమణ, రత్నం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం



సదస్యంలో పాల్గొన్న పండితులు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష

అల్లిపురం: ఇసుకు కొండపై వేంచేసిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా వేద ఋత్విక్కులచే చతుర్వేదాల పారాయణం భాగంగా వేద మంత్రాలు శ్రావ్యంగా పఠనం చేయడంతో భక్తులు భక్తి పరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు పీవీ నరసింహమూర్తి జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీషను వేదాశీర్వచనంతో దీవించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో బుద్ద మహాలక్ష్మి, నగేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

సీతంపేట: జీవీఎంసీ టీఎస్సార్ ప్రాంగణంలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న కారణంగా శని, ఆదివారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జోన్-3 పరిధిలోని సీతంపేట, అక్కయ్యపాలెం లలితా నగర్, ఎన్జీజీవోస్ కాలనీ, చిన్నూరు, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాకయ నగర్, మంగాపురం కాలనీ, పిఠాపురం కాలనీ, శివాజీపాలెం, మద్దిలపాలెం, ఎంవీపీ 1 నుంచి 12 సెక్టార్లు, జాలరిపేట, వాసవానిపాలెం, ఆదర్శనగర్, పెద వాల్తేర్, చినవాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పీతలవానిపాలెం ప్రాంతాలు.. జోన్-5 పరిధిలోని శ్రీనివాసనగర్, నందగిరి నగర్, నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వర కాలనీ, జ్ఞానాపురం, బాబూ కాలనీ, సిరుల వీధి, సెబాస్టియన్ కాలనీ, జీఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీ, సుబ్బలక్ష్మినగర్, తాటిచెట్లపాలెం, అబిద్ నగర్, శ్రీనివాసనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, చాకలిపేట, టీఎస్ఎన్ కాలనీ ప్రాంతాలను శనివారం ఉదయం 10 నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నీటి సరఫరా జరగదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

కేబుల్ వైర్లపై అవగాహన

దాబాగార్డెన్స్: గ్లోస్టర్స్ సంస్థ ప్రతినిధులు వినయ్ రాఠి, ఆశిష్ ప్రమోద్‌మోదీ శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల ఓ హోటల్లో కేబుల్ వైర్లకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్ఆర్ ఎల్ఎస్‌హెచ్ వైర్ ప్రత్యేకత వివరించారు. ఈ వైర్ కాపర్‌పై త్రీ లేయర్ ఇన్సులేషన్ ఉంటుందని, మిగిలిన వైర్లు 70 డిగ్రీస్ వరకు ఉష్ణోగ్రతను తట్టుకోగలవని, గ్లోస్టర్ వైర్లు 105 డిగ్రీల ఉష్ణోగ్రతను సైతం తట్టుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్ కాల్య, జయకిషోర్ వేపూరి, హరీష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లాలోని 24 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 2,041 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,708 మంది పరీక్షకు హాజరయ్యారు. 333 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 14 సెంటర్లును తనిఖీ చేశాయి.

తక్షణమే దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25లు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యేవారన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్)లు తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్ఎన్ లేబరేటరీస్ హైదరాబాద్, హెటిరో, దక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్ ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వైర్ సొల్యూషన్స్, టీజేఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్‌తో పాటు పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 560 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 1,013 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 305 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధా చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాల ఏర్పాట్లు, క్యూలైన్లు, మెడికల్, మంచినీటి సదుపాయం తదితర సదుపాయాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేకి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు వివరించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యేకి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తాను కూడా సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రభుప్రసాద్, 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



ఫుడ్‌కోర్టు ప్రాంతంలో చెత్తాచెదారాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్-4 పరిధి సెంట్రల్ పార్క్, రామ్‌నగర్, గవర్నర్ బంగ్లా, జిల్లా పరిషత్ జంక్షన్, మహారాణిపేట, ద్రోణంరాజు సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రి పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహించడం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ కోర్ట్ ప్రాంతంలో శానిటేషన్ పరిశీలించి బడ్డీల కింద ఉన్న వ్యర్థాలను తొలగించడం లేదని, దుకాణదారులు ఎవరి దుకాణం కింద ఉన్న చెత్తను వారే తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో మూత్ర విసర్జనతో పాటు తినుబండారాల వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడవేస్తున్నారని వాకర్స్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, మూత్ర విసర్జన చేయకుండా నిరోధించాలని, ఈ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మహారాణిపేట భారతి హాస్పటల్ వద్ద చెత్త అధికంగా ఉందని, వెంటనే శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశిస్తూ, ఇకపై వ్యర్థాలు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ద్రోణంరాజు సర్కిల్ అభివృద్ధిపై పర్యవేక్షక ఇంజినీరు వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్‌తో చర్చించారు.

బీజేపీ ఎంపీని తక్షణం అరెస్టు చేయాలి

సీతమ్మధార : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఆమె మాట్లాడుతూ బాధిత మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఒలింపిక్స్‌లో పతకాలు తీసుకొచ్చి దేశానికి గుర్తింపు తెచ్చిన మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితుల్లో ఒక మైనర్ బాలిక కూడా ఉందన్నారు. ఈ ఘటనపై నియమించిన కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని, ప్రస్తుత డబ్ల్యూఎఫ్ఐని రద్దు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా చేతన, మానవ హక్కుల వేదిక, భారత నాస్తిక్ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివ రామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన శ్రీ ఉమా చంద్రమౌళేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా నవగ్రహ మండపారాధన, మృత్యుంజయహోమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణం.. శనివారం సాయంత్రం శ్రీ ఉమా చంద్రమౌళేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయ్ తెలిపారు. కల్యాణం చేయించుకునే భక్తులు ముందుగా తమ పేర్లు ఆలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో దత్తపవర్

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు పిస్టల్‌ను తరలించేందుకు సహకరించిన దత్తపవర్‌ను ఫోర్త్ టౌన్ పోలీసులు మహారాష్ట్ర నుంచి నగరానికి శుక్రవారం తీసుకొచ్చారు. శ్రీధర్ హరికిషన్ పతాంగికి పిస్టల్ ఇచ్చి పంపిచవలసిన అవసరం ఏంటని విచారణ చేపట్టారు. ప్రస్తుతం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పిస్టల్ ఇచ్చిన వ్యక్తిని పూరిలో ఉన్న వ్యక్తి ఎవరు..? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి బీఎల్‌సీలో ఇళ్ల మంజూరు చేయించాలని ఎమ్మెల్యే హౌసింగ్ బోర్డు అధికారును ఆదేశించారు. నిరుపేద వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పిల్లలకు ఎమ్మెల్యే తన వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం జూనియర్ కాలేజీలో ఉచితంగా అడ్మిషన్లు కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు, బోణి దేవ, వేగి వెంకటప్పారావు, వడ్డాది దిలీప్, బొడ్డేటి కిషోర్, రామరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాదర్బార్‌లో భాగంగా 41వ వార్డు జ్ఞానాపురానికి చెందిన కొండవలస మురళీ మోహన్‌రావు రెండవ కుమార్తె వివాహం నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 37వ వార్డు రెల్లివీధికి చెందిన రమణమ్మకు మందుల నిమిత్తం రూ.3 వేలు అందజేశారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశమైన 39వ వార్డు ముస్లిం పెద్దలు

జగదాంబ: ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు దక్షిణ నియోజవర్గం ఎమ్మెల్యే సీటు మైనార్టీ ముస్లింలకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు ముస్లింలు డిమాండ్ చేశారు. గతంలో డాక్టర్ డీన్, అబ్దుల్ రహమాన్ ఇద్దరు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ఉన్న 34 సీట్లు, గోదావరి జిల్లాల్లో ఉన్న 34 సీట్లలో ఎక్కడా ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఓటు బ్యాంక్ చూసినా ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. అలాగే విశాఖమదీనా వలీ దర్గా భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని రక్షించే నాథుడే లేడన్నారు. ముస్లిం పెద్దలు మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ అలీ, నాజర్ పాల్గొన్నారు.